క్లుప్తంగా

కిన్నెరవాడలో పండుగ ఏర్పాట్లు


రథాన్ని తయారు చేస్తున్న దృశ్యం

సారవకోట: కిన్నెరవాడ గ్రామంలో 12 ఏళ్ల తరువాత మాను పండుగ నిర్వహణకు కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 30 నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. గతంలో కంటే ఈసారి వైభవంగా పండుగను నిర్వహించేలా చూస్తున్నారు. 40 అడుగల మానును కత్తిరివానిపేట నుంచి తెచ్చి రథాన్ని తయారు చేసి తిరువీధి నిర్వహించనున్నారు. లక్ష రూపాయలతో రథం తయారు చేయించారు. పారిశుద్ధ్యం, మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


రోగులను పరీక్షిస్తున్న తాతయ్యలు

సరుబుజ్జిలి: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సత్యసాయిసేవా సంస్థల జిల్లా వైద్య విభాగం ఇన్‌చార్జి పి.తాతయ్యలు కోరారు. మండల కేంద్రంలో సత్యాసాయిసేవాసంస్థల ఆధ్వర్యంలో సత్యసాయి నర్సింగ్‌హోమ్ సౌజన్యంతో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. 115 మందికి తనిఖీలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసంస్థల కోకన్వీనర్ ఎ.గజపతి, జిల్లా అధ్యక్షుడు లింగరాజు, వైద్యులు పి.సుభాష్‌చంద్ర, అన్నెపు శేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డేపల్లి హరి, ఇల్లాకుల సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై అవగాహన


తెగుళ్ల నివారణపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

పాతపట్నం: మిరప పంటను సోకే తెగుళ్ల నివారణపై కాపుగోపాలపురం గ్రామానికి చెందిన రైతులకు సెంచూరియన్ యూనివర్సిటీ బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు హేమంత్, దివ్యశ్రావణి, వినీలలు.. మిరప పంటలో పసుపు జిగురు అట్టల ఉపయోగాలు, తెల్లపురుగులు, దోమలను నివారించడానికి తీసుకున్న జాగ్రత్తలపై రైతులకు వివరించారు. రైతులు ఎన్ని కేశవరావు, బోధాని వాసుదేవరావు పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగపడేలా విత్తన ప్రణాళిక

ఎల్.ఎన్.పేట: రైతులకు ఉపయోగపడేలా విత్తన ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు మండల వ్యవసాయ అధికారిణి పైడి లతశ్రీ అన్నారు. తురకపేట రైతు భరోసా కేంద్రంలో సర్పంచ్ మొదవలస యోగీశ్వరి ఆధ్యక్షతన రైతులతో ఆదివారం సమావేశమయ్యారు. ఎంతమంది రైతులు ఉన్నారు, ఎన్ని విత్తనాలు అవసరం ఉంటుంది, ప్రభుత్వం సరఫరా చేసే విత్తన రకాలు ఏమిటి అనే అంశాలపై రైతుల సమక్షంలోనే చర్చిస్తామన్నారు. రైతుల సూచనలు పరిగణలోకి తీసుకుంటామని చెప్పారు. గ్రామ సచివాలయ వ్యవసాయ శాఖ సహాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

ఆమదాలవలస రూరల్: విద్యుత్ సమస్యలు తలెత్తితే తక్షణమే పరిష్కరిస్తామని ఎలక్ట్రికల్ రూరల్ ఏఈ బి.రవికుమార్ తెలిపారు. చీమలవలస, చేపానపేట, మునగవలస, వంజంగి గ్రామాల్లో విద్యుత్ తీగల మార్పిడి, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగించే చెట్ల తొలగింపు పనులను ఆదివారం చేపట్టారు. విద్యుత్ తీగలకు చెట్లు అడ్డంగా ఉన్నందున సరఫరాలో లోపాలు వస్తున్నాయని, వాటిని తొలగిస్తున్నామన్నారు. చెట్ల తొలగింపునకు స్థానికులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రైతు భరోసా నమోదుకు మరో అవకాశం

ఆమదాలవలస రూరల్: రైతు భరోసా పథకం నమోదుకు ప్రభుత్వం మరో అవకాశాన్ని కల్పించిందని మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వివరాల నమోదుకు రైతు ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్, ఫోన్ నంబర్, ఒరిజినల్ ఒన్‌బీతో సమీప రైతు భరోసా కేంద్రాల్లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. రైతులు తమ దరఖాస్తులను గ్రామ వలంటీర్ల ద్వారా ఆర్‌బీకేల్లో అందజేయాలన్నారు.


ఎల్.ఎన్.పేట: చిన్నకొల్లివలస పునరావాస కాలనీలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, సర్పంచ్ రామారావు


బూర్జ: తోటవాడలో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను ప్రదర్శిస్తున్న నాయకులు


పాతపట్నం: చంగుడిలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి సమక్షంలో సీఎం చిత్రపటానికి ముద్దాడుతున్న వృద్ధురాలు


ఆమదాలవలస: 8వ వార్డులో సంక్షేమాన్ని వివరిస్తున్న సచివాలయాల కోఆర్డినేటర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు

జగనన్నా.. నీ రుణం తీర్చుకోలేం

భవిష్యత్తుకు భరోసా ఇచ్చిన జగనన్నా నీ రుణం తీర్చుకోలేమని జనం అంటున్నారు. సంక్షేమ పథకాలతో ఆదుకుంటున్న మీకు అండగా ఉంటామని ధైర్యాన్ని ఇస్తున్నారు. 'జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో భాగంగా మండుంటిండలో కూడా వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజా సర్వే చేపడుతున్నారు. వీరికి లబ్ధిదారులు ఆప్యాయంగా ఆహ్వానం పలుకుతున్నారు. చేకూరిన లబ్ధిని ఆనందంతో తెలియజేస్తున్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనే గెలుపించుకుంటామని చెబుతున్నారు. ఇంటి యజమానుల అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను గోడలపై.. సెల్‌ఫోన్లపై సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు అతికిస్తున్నారు. ఆదివారం పలు గ్రామాల్లో కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. పాతపట్నం మండలం చంగుడి, సరాళి గ్రామాల్లో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రెడ్డి శాంతి నిర్వహించారు. కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు.


సరుబుజ్జిలిలో సీఎం జగన్ స్టిక్కర్‌కు నమస్కరిస్తున్న వృద్ధురాలు కృష్ణమ్మ


హిరమండలం: తంప గ్రామంలో జగనన్న ఫొటోకు హారతిస్తున్న బెజ్జిపల్లి జ్యోతి


మెళియాపుట్టి: నాయుడు పోలూరులో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నాయకులు


సరుబుజ్జిలి: వీరభద్రాపురంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు


హిరమండలంలో కార్యక్రమంలో నాయకులు


సారవకోట: వాండ్రాయిలో కార్యక్రమం నిర్వహిస్తున్న పార్టీ నాయకులు


నరసన్నపేట: నరసన్నపేటలోని కోవెలవీధిలో బుక్‌లెట్, స్టిక్కర్లు అందజేస్తున్న ఉప సర్పంచ్ కృష్ణబాబు తదితరులు


ఆమదాలవలస రూరల్: నిమ్మతొర్లాడలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సచివాలయ కన్వీనర్ తేజేశ్వరరావు



ఆమదాలవలస: 12వ వార్డు చంద్రయ్యపేటలో కార్యక్రమం నిర్వహిస్తున్న మాజీ కౌన్సిలర్ దుంపల శ్యామలరావు

'రైతులకు మేలు చేయండి'


కృష్ణదాస్‌ను సత్కరిస్తున్న దృశ్యం

నరసన్నపేట: నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సొసైటీ అధ్యక్షులుగా కొత్తవారిని నియమించామని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. అందరూ బాధ్యతగా పనిచేసి రైతులకు మేలు చేయాలని సూచించారు. నరసన్నపేట సొసైటీ అధ్యక్షుడుగా నియమించిన పొన్నాన దాలినాయుడు స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యేను ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం కృష్ణదాస్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రుణాలు, ఎరువులు సకాలంలో అందేలా చూడాలని సూచించారు. ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, నరసన్నపేట సర్పంచ్ బూరలి శంకర్ తదితరులు ఉన్నారు.

వడదెబ్బకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలి


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఎల్.ఎన్.పేట: ఎండల తీవ్రత పెరుగుతున్నందున వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని శ్రీకాకుళం మాస్ మీడియా అధికారి పైడి రమణ, స్థానిక వైద్యురాలు డాక్టర్ ఎస్.సునీత అన్నారు. లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ ఆస్పత్రి వద్ద వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు తీసుకునే జాగ్రత్తలపై ఆదివారం అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. మజ్జిగ, గ్లూకోజ్ నీళ్లు, కొబ్బరి బొండాలు, నిమ్మకాయ నీళ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు నీటిలో కలిపి తాగాలన్నారు. ఉదయం పది గంటల తరువాత సాయంత్రం నాలుగు గంటలకు ముందు ఎండలో తిరగ వద్దన్నారు. ఉపాధి హామీ పథకం పనులు చేసే వేతనదారులు, రైతు కూలీలు ఎండ సమయంలో విశ్రాంతి తీసుకోవాలన్నారు. ఆరోగ్య సూపర్‌వైజర్లు, పద్మ, బెండి జనార్దనరావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మండలాలకు చేరిన పరీక్ష పేపర్లు


ఎంఈవో కార్యాలయానికి చేరిన ప్రశ్న పత్రాలు

నరసన్నపేట: పాఠశాలల్లో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల నిర్వహణకు విద్యా శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రశ్న పత్రాలు మండల కేంద్రాలకు చేరాయి. ఈ నెల 20 నుంచి 29వ తేదీ వరకూ పరీక్షలు ఉంటాయి. ఎఫ్ఏ-2 పరీక్షలు నిర్వహిస్తారు. మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 9,600 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ ఏడాది ఓఎంఆర్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. కాగా 1, 2 తరగతులకు 20న తెలుగు, 24న ఇంగ్లిషు, 25న గణితం, మూడు నుంచి ఐదో తరగతులకు 20న తెలుగు, 24న ఇంగ్లిషు, 25న గణితం, 26న పరిసరాల విజ్ఞానం ఉంటాయి. 6 నుంచి 9 తరగతులకు 20న తెలుగు, 24న హిందీ, 25న ఇంగ్లిషు, 26న గణితం, 27న జనరల్ సైన్స్, 28న సోషల్ స్టడీస్, 29న కంపోజిట్ కోర్సులు పేపర్-1 పరీక్షలు జరుగుతాయి. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నామని ఎంఈవో శాంతారావు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గ్రామదేవత ఉత్సవాలు

సారవకోట: తొగిరి పంచాయతీ తర్లి గ్రామంలో మరిడమ్మ తల్లి గ్రామదేవత ఉత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు ఘటాలతో వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల ఆదినారాయణ, బోనె జోగారావు తదితరులున్నారు.

బాహుదా నదిలో ఎర్త్ బండ్ ఏర్పాటు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలోని ప్రజలకు తాగు నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు బాహుదా నదిలో ఎర్త్ బండ్‌ని ఆదివారం ఏర్పాటు చేసినట్లు కమిషనర్ ఎన్.రమేష్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కందుకూరి జయంతి


కందుకూరు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సంతబొమ్మాళి: స్థానిక గ్రంథాలయంలో బహుముఖ ప్రజ్ఞాశాలి కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు జాతి గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి, సాహితీవేత్త, జనోద్ధారకుడు, సంఘ సంస్కర్త కందుకూరి అని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.రామకృష్ణ, రీడర్స్ సురేష్, నారాయణ, వినోద్, రమేష్, శివ, లక్ష్మి, బాబురావులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక భేటీ


ఎమ్మెల్సీ రామారావును సత్కరిస్తున్న డాక్టర్ పూడి కిరణ్‌కుమార్

కవిటి: స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా విజయం సాధించిన నర్తు రామారావును పలువురు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ పూడి కిరణ్ కుమార్ ఎమ్మెల్సీ రామారావును సత్కరించారు. నియోజకవర్గం అభివృద్ధిలో కలిసి పనిచేస్తానని తెలియజేశారు.

ట్రస్టు సేవలు అభినందనీయం


మరుగుదొడ్లు ప్రారంభిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

కవిటి: ఉద్దానం ప్రజల ఆరాధ్య దైవం కవిటిలో వెలసిన చింతామణి అమ్మవారి ఆలయ అభివృద్ధికి హైదరాబాద్‌కు చెందిన చింతామణి ట్రస్టు రూ.2.70 లక్షల విరాళం అందించడం అభినందనీయమని సర్పంచ్ పూడి లక్ష్మణరావు అన్నారు. ఈ మేరకు ఆ నిధులతో నిర్మించిన నూతన మరుగుదొడ్ల సముదాయాన్ని ట్రస్టు ప్రతినిధులు ఇందిరాదేవి, మణికుమార్‌లు ఆదివారం ప్రారంభించారు.

కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు


గజ ముద్దలను ఊరేగిస్తున్న భక్తులు

ఇచ్ఛాపురం రూరల్: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న లొద్దపుట్టి ధనరాజులమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆంధ్రా, ఒడిశా గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. గజముద్ద నైవేద్యంగా మేళతాళాలతో అమ్మవారిని ఊరేగించారు

రక్తదానంతో ప్రాణదానం


రక్తదానం చేస్తున్న యువకులు

కంచిలి: రక్తదానంతో ప్రాణదానం చేయవచ్చని జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పీఆర్‌వోపీ చైతన్యకుమార్ అన్నారు. మండల కేంద్రంలోని సోంపేట ఆర్ఎస్ రెస్టుహౌస్‌లో రైల్వే కర్మచారి ట్రాక్ మెయిన్ టైనర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రక్తదాన శిబిరం ఆదివారం నిర్వహించారు. దీనిలో భాగంగా 25 మంది రక్తదానం యువకులు చేశారు. కార్యక్రమంలో ఆర్‌కేటీఏ ప్రెసిడెంట్ వి.రవి, ఈస్ట్‌కోస్ట్ జోనల్ ప్రెసిడెంట్ బి.రవికుమార్, ప్రధాన కార్యదర్శి తపస్‌కుమార్ బారిక్, సోంపేట కార్యదర్శి టి.లక్ష్మీనారాయణ, రెడ్‌క్రాస్ మెడికల్ ఆఫీసర్ పి.తేజ, కో-ఆర్డినేటర్ కె.సత్యనారాయణ, వలంటీర్ పి.కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం


నరసన్నపేట: గ్యాస్ మంట నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

నరసన్నపేట: ఇళ్లల్లో గ్యాస్ లీకై అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయని.. మహిళలు అప్రమత్తంగా ఉండాలని నరసన్నపేట అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి ఆఫీసర్ కె.సుందరరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఇందిరా నగర్ కాలనీలో మహిళలకు గ్యాస్ లీకై ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మంటలను అరికట్టడంపై ఆదివారం అవగాహన కల్పించారు. మహిళలచే డెమో నిర్వహించారు. వంట పూర్తయిన తరువాత రెగ్యులేటర్ వద్ద గ్యాస్‌ను ఆఫ్ చేయాలని సూచించారు. సిలండర్ నుంచి గ్యాస్ లీకై మంట వస్తే భయాందోళన చెందకుండా తడి క్లాత్ సిలిండర్ చుట్టూ కప్పితే గ్యాస్ మండటం నిలిచి పోతుందన్నారు. అలాగే ఖాళీ డబ్బాను గాలి చొరబడకుండా గట్టిగా పెట్టినా సిలిండర్ నుంచి వచ్చే మంట అదుపులోకి వస్తోందన్నారు. కార్యక్రమంలో లీడ్ ఫైర్ మన్ భాస్కరరావు పాల్గొన్నారు.

ఆమదాలవలస: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ఆమదాలవలస ఫైర్ స్టేషన్ అధికారి కె.అప్పారావు సూచించారు. గాజులకొల్లివలస, ఆర్ఆర్ కాలనీల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. వంటగ్యాస్ వల్ల ఏర్పడే ప్రమాదాలు, నివారణ చర్యలు, పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సిబ్బంది హరినారాయణ, తదితరులు పాల్గొన్నారు.


ఆమదాలవలస: ఆర్ఆర్ కాలనీలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి అప్పారావు తదితరులు

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి


డాన్సు వేస్తున్న విద్యార్థులు

కంచిలి: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి అన్నారు. స్థానిక బీసీ బాలుర ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ డే వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ జి.రామారావు, జెడ్పీహెచ్ స్కూల్ హెచ్ఎం సీతారాంనాయుడు, మండల వైఎస్సార్‌సీపీ నేత ఇప్పిలి కృష్ణారావు, టీడీపీ నాయకుడు జగదీష్ పట్నాయక్, విశ్రాంత ఉపాధ్యాయులు సోమేశ్వరరావు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మ తల్లి ఆలయం వద్ద ఆదివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఆలయ చైర్మన్ బోయిన మాధవి, కార్య నిర్వాహణాధికారి వి.రాధాకృష్ణ తదితరులు చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఎండలు అధికంగా ఉండడంతో చలివేంద్రాన్ని భక్తులు ఉపయోగించుకోవాలని సూచించారు.